
# కాంగ్రెస్ పార్టీలో ఫిరాయింపు లొల్లి

- పాంచ్‌న్యాయ్ సూత్రాలకు విరుద్ధమంటూ సొంత పార్టీ నేతల నుంచే విమర్శలు
- ఢిల్లీని తాకిన తెలంగాణ పంచాయితీ
- అధిష్ఠానానికి తలనొప్పిగా రేవంత్‌రెడ్డి తీరు
- హిమాచల్‌ప్రదేశ్‌లో లో ఒక నీతి.. తెలంగాణలో మరో నీతి




హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ పార్టీలో ఫిరాయింపుల చిచ్చు రగులుకున్నది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాలు అధిష్ఠానానికి పెద్ద తలనొప్పిగా మారాయి. తెలంగాణలో ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న తీరు కాంగ్రెస్ ప్రకటించిన పాంచ్‌న్యాయ్ సిద్ధాంతాలకు విరుద్ధంగా ఉండటంతో ఆ పార్టీ చిత్తశుద్ధిపైనే అనుమానాలు కలుగుతున్నాయి. తెలంగాణలో జరుగుతున్న ఫిరాయింపులు కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతానికి, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ చెప్పినదానికి వ్యతిరేకంగా ఉండటంతో ఇంటా బయటా ఇరకాటాన్ని సృష్టిస్తున్నాయి. దీంతో టీపీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్ల అధిష్ఠానం ఆగ్రహంగా ఉన్నట్టు సమాచారం. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తున్న రేవంత్‌రెడ్డి చర్యలు పాంచ్‌న్యాయ్ సిద్ధాంతానికి, పార్లమెంట్ ఎన్నికల్లో రాహుల్‌గాంధీ చెప్పిన దానికి వ్యతిరేకంగా ఉన్నాయంటూ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టీ జీవన్‌రెడ్డి వ్యక్తంచేసిన ధర్మాగ్రహంలో న్యాయం ఉన్నదని పార్టీ పెద్దలు ఏకీభవిస్తున్నారు. జీవన్‌రెడ్డితో స్వయంగా మాట్లాడటానికి పార్టీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ ఢిల్లీకి ఆహ్వానించడం తెలంగాణ కాంగ్రెస్‌లో ప్రకంపనలు సృష్టిస్తున్నది. రేవంత్‌రెడ్డి తన సొంత ఎజెండాతో స్వీయ ప్రయోజనాల కోసం పార్టీ ప్రయోజనాలను పణంగా పెడితే, భవిష్యత్తులో పార్టీ పరిస్థితి ఏమిటని కాంగ్రెస్ అధిష్ఠానం ఆందోళన చెందుతున్నది.

### ఫిరాయింపులపై ఎందుకీ లొల్లి?

తెలంగాణలో ప్రస్తుతం అధికార కాంగ్రెస్ పార్టీకి పూర్తి మెజార్టీ ఉన్నప్పటికీ, అవసరం లేకున్నా ఇతర పార్టీల ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకోవడం, పార్టీ కోసం మొదటినుంచీ కష్టపడిన వారిని పక్కనపెట్టడం, సీనియర్లను సైడ్‌లైన్‌చేయడం, పాంచ్‌న్యాయ్‌కు వ్యతిరేకంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం, పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎన్నికల ప్రచారంలో చెప్పిన దానికి విరుద్ధంగా ఎమ్మెల్యేలను చేర్చుకోవడం, ఒక పార్టీలో గెలిచి మరొక పార్టీలో చేరడాన్ని గతంలో తీవ్రంగా ఎండగట్టిన పీసీసీ అధినేత రేవంత్‌రెడ్డి ఇప్పుడు స్వయంగా ఇందుకు ఒడిగట్టడం వంటి పరిణామాలు కాంగ్రెస్ పార్టీలో చిచ్చు రగిలించాయి. దీంతో పాత కాంగ్రెస్ నేతలకు, కొత్తగా చేరిన వారికి మధ్య అగాథం ఏర్పడుతున్నది. పార్టీలో మునుపెన్నడూ లేనివిధంగా సీనియర్లు, జూనియర్లు, పాతవారు, కొత్తవారు అనే వివాదం ముదురుతున్నది. పార్టీలో మొదటినుంచీ ఉంటూ, పార్టీ అధికారంలో లేనప్పుడు సైతం కష్టనష్టాలను ఓర్చుకుంటూ పనిచేసిన నాయకుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రంలో అధికారం అతి చేరువకు వచ్చి అందకుండా పోవడం నుంచి ఇంకా తేరుకోకముందే, తెలంగాణలో రేగిన ఫిరాయింపుల చిచ్చు తలనొప్పిగా మారడంతో కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహంగా ఉన్నట్టు ఢిల్లీలో మకాం వేసిన ఆ పార్టీ ముఖ్య నాయకుడు ఒకరు వ్యాఖ్యానించారు.

### కర్ణాటకలో ఈ పరిస్థితి ఎందుకు లేదు?

దక్షిణాదిలో కాంగ్రెస్ పార్టీ కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉన్నది. తెలంగాణలో మాదిరిగా కాకుండా కర్ణాటకలో అధికార కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులకు దూరంగా ఉంటున్నది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామని బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు హెచ్చరించిన కారణంగానే తమ సంఖ్యాబలం పెంచుకుంటున్నట్టు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్తున్నారు. నిజానికి ఇలాంటి ప్రమాదం కర్ణాటకలో సైతం ఉన్నది. అక్కడ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చుతామని బీజేపీ నేతలు మొదటినుంచీ హెచ్చరిస్తూనే ఉన్నారు. పైగా అక్కడ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చిన చరిత్ర కూడా బీజేపీకి ఉన్నది. కానీ, తెలంగాణ రాష్ట్రంలో అలాంటి చరిత్ర లేదు. ప్రభుత్వాన్ని కూల్చుతారేమోనన్న సాకుతో ఫిరాయింపులను సీఎం రేవంత్‌రెడ్డి సమర్థించుకోవడం హాస్యాస్పదం అనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.

### కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు

కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ ప్రమాణాలను అమలుచేస్తున్నది. ఒకవైపు తమ పార్టీ ఫిరాయింపులకు వ్యతిరేకం అంటూనే మరోవైపు తెలంగాణలో వాటిని ప్రోత్సహిస్తున్నది. తాము ఫిరాయింపులకు వ్యతిరేకమని పార్లమెంట్ ఎన్నికల మ్యానిఫెస్టోలోని పాంచ్‌న్యాయ్‌లో స్పష్టం చేసింది. తాము కేంద్రంలో అధికారంలోకి వస్తే పార్టీ ఫిరాయింపులపై ఉక్కుపాదం మోపుతామని ఎన్నికల ప్రచార సభల్లో రాహుల్‌గాంధీ పదే పదే వ్యాఖ్యానించారు. కానీ, తాము అధికారంలో ఉన్న తెలంగాణలో మాత్రం ప్రతిపక్ష బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం కాంగ్రెస్ చెప్తున్న, ఆచరిస్తున్నదానికి పొంతనలేదని నిరూపిస్తున్నది.


## హిమాచల్‌ప్రదేశ్‌లో అనర్హత.. ఇక్కడ వర్తించదా?

హిమాచల్‌ప్రదేశ్‌లో అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్యేలు పార్టీ విప్‌కు వ్యతిరేకంగా రాజ్యసభ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేశారు. దీంతో అక్కడ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయగానే స్పీకర్ ఆ ఆరుగురిపై అనర్హత వేటు వేశారు. దీనిని సవాల్ చేస్తూ విప్‌ను ధిక్కరించిన ఎమ్మెల్యేలు సుప్రీంకోర్టును ఆశ్రయించగా, స్టే ఇవ్వడానికి నిరాకరించింది. అదే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు చెందిన ఐదుగురు ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్న నేపథ్యంలో వారిపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదు.

## హర్యానాలోనూ అదే తంతు

కాంగ్రెస్ రెండు నాలుకల ధోరణికి హర్యానా ఉదంతం మరో ఉదాహరణ. అక్కడి కాంగ్రెస్ ఎమ్మెల్యే కిరణ్‌చౌదరి ఇటీవల బీజేపీలో చేరారు. దీంతో అక్కడి కాంగ్రెస్ పార్టీ నేతలు పెడబొబ్బలు పెడుతున్నారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ సెక్షన్ 2(1)(ఏ) ప్రకారం సదరు ఎమ్మెల్యేపై అనర్హత వేటు వేయాలని కోరుతూ స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ పార్టీ గుర్తుపై గెలిచిన ఎమ్మెల్యేకు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని స్పీకర్‌ను కోరుతున్నారు. మరి జాతీయ పార్టీ కాంగ్రెస్ పార్టీకి ఒక విధానం, సిద్ధాంతం అంటూ ఉండదా? ఒక్కో రాష్ట్రానికి ఒక్కో రకమైన వైఖరి ఉంటుందా? దీనికి ఆ పార్టీ ఏం సమాధానం చెప్తుందని ప్రజాస్వామికవాదులు ప్రశ్నిస్తున్నారు.

## లోకం పోకడ




మొన్న పార్టీలోకి వస్తే చేర్చుకున్నారు..
నిన్న ఇంటికెళ్లి ఆహ్వానించారు..
ఇవ్వాళ ఎత్తుకు పోతున్నారు!

## వానకాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| నిజామాబాద్ | 37.2°c | 25.4°c |
| రంగారెడ్డి | 36.8°c | 23.1°c |
| మెదక్ | 36.7°c | 23.8°c |
| ఆదిలాబాద్ | 36.8°c | 26.7°c |
| మహబూబ్‌నగర్ | 35.1°c | 25.2°c |
| కరీంనగర్ | 35.0°c | 26.0°c |
| హైదరాబాద్ | 34.6°c | 25.4°c |
| వరంగల్ | 34.0°c | 25.0°c |
| నల్లగొండ | 33.0°c | 24.2°c |
| ఖమ్మం | 30.0°c | 25.0°c |

## రెండు రోజులు భారీ వర్షాలు

- మూడు జిల్లాల్లో లోటు వర్షపాతం

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రాగల రెండురోజులు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల బలమైన ఉపరితల గాలులతో వర్షాలు కురుస్తాయని పేర్కొన్నది. బుధవారం నుంచి గురువారం వరకు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. గురువారం నుంచి శుక్రవారం వరకు ఉమ్మడి ఆదిలాబాద్, జగిత్యాల, కరీంనగర్, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. ఈ సీజన్‌లో కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాలలో లోటు వర్షపాతం నమోదైనట్టు తెలిపింది.



ఉప్పునుంతలలో పాల బిల్లులు చెల్లించాలని రోడ్డుపై ధర్నా చేస్తున్న రైతులు

## రోడ్డెక్కిన పాడి రైతులు

ఉప్పునుంతల, జూన్ 26 : పాడి రైతులు రోడ్డెక్కారు. విజయ డెయిరీ పాలు కొనుగోలు చేసినా రెండు నెలలుగా బిల్లులు చెల్లించకపోవడంతో ఆగ్రహం వ్యక్తంచేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తాలో బుధవారం ధర్నాకు దిగారు. క్యాన్లలో తీసుకొచ్చిన పాలను రోడ్డుపై పారబోసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. సకాలంలో పాల డబ్బులు రాకపోవడంతో పిల్లలకు స్కూల్ ఫీజు కట్టలేకపోతున్నామని వాపోయారు. ఒక్కొక్కరికి రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు బిల్లులు రావాల్సి ఉన్నదని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో సకాలంలో బిల్లులు అందేవని వారు గుర్తుచేశారు.

## అనర్హత వేటు వేయాల్సిందే

మొదటిపేజీ తరువాయి...

తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తమ పిటిషన్‌ను స్వీకరించడానికి స్పీకర్ సమయం ఇవ్వకపోవటంతో తమకు ఉన్న మార్గాల ద్వారా ఆయనకు చేరవేశామని తెలిపారు. తెలంగాణ భవన్‌లో బుధవారం మాజీ ఎమ్మెల్సీలు నారదాసు లక్ష్మణ్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సీనియర్ నేత గ్యాదరి బాలమల్లు తదితరులతో కలిసి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్‌ని తక్షణమే అనర్హులుగా ప్రకటించాలని కోరేందుకు తాము స్పీకర్‌ను కలిసేందుకు మంగళవారం నుంచి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. తమకు సమయం ఇచ్చే విషయాన్ని పరిశీలించి చెప్తానని స్పీకర్ ఫోన్‌లో సమాధానం ఇచ్చారని తెలిపారు. కానీ మంగళవారం రాత్రి దాకా ఆయన నుంచి పిలుపు రాలేదని చెప్పారు. తిరిగి బుధవారం కూడా పలుమార్లు స్పీకర్‌ను కలిసేందుకు ప్రయత్నించగా.. ఆయన వికారాబాద్ పర్యటనలో ఉన్నట్టు స్పీకర్ ఓఎస్డీ సమాధానం ఇచ్చారని తెలిపారు. దీంతో ఎమ్మెల్యేలపై అనర్హత పిటిషన్‌ను స్పీకర్‌కు ఈ-మెయిల్ చేయటమే కాకుండా స్పీడ్ పోస్ట్ ద్వారా కూడా పంపించామని, శాసనసభ కార్యాలయానికి సైతం తమ పిటిషన్‌ను పంపామని వివరించారు.


### కేసీఆర్ ఇల్లిల్లూ తిరగలేదు

కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలను చేర్చుకొనేందుకు తమ పార్టీ అధినేత కేసీఆర్ కండువా పట్టుకొని ఇల్లిల్లూ తిరగలేదని జగదీశ్‌రెడ్డి గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ టికెట్‌పై గెలిచిన ఎమ్మెల్యేల్లో చట్టప్రకారం 2/3 వంతు మంది స్వచ్ఛందంగా బీఆర్ఎస్‌లో చేరారని, దానికి దీనికి పోలిక ఉందా? అని ప్రశ్నించారు. తమ పార్టీ అధినేత కేసీఆర్‌ను కలిసేందుకు ప్రజాప్రతినిధులు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ ప్రతినిధులే కాకుండా ప్రజలూ తండోపతండాలుగా వెళుతున్నారని చెప్పారు.

### వారి సభ్యత్వం రద్దు కావాల్సిందే

పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ సంజయ్ సభ్యత్వం రద్దు కావల్సిందేనని, అప్పటిదాకా విడిచిపెట్టే ప్రసక్తేలేదని జగదీశ్‌రెడ్డి స్పష్టంచేశారు. కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో పార్టీ ఫిరాయింపులకు పాల్పడకుండా పటిష్ఠమైన చట్టం తెస్తామని పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ పాంచ్‌న్యాయ్‌ను ఆయన ఉదహరించారు. కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోను ఆ పార్టీనే పాటించకపోతే దానికి విలువ ఉంటుందా? అని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వంటి వారే ప్రశ్నిస్తున్న అంశాన్ని ఈ సందర్భంగా గుర్తుచేశారు. స్పీకర్ తక్షణమే వారి సభ్యత్వాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

### కలెక్టర్ మీటింగ్‌లోనూ పవర్‌కట్



పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీహర్ష బుధవారం రామగుండం పర్యటనలో భాగంగా తొలిసారిగా రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరుపై అధికారులతో కమిషనర్ చాంబర్‌లో సమీక్షిస్తుండగా కరెంటు పోయింది. విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగడంతో కార్యాలయంలో ఒక్కసారిగా చీకట్లు అలుముకున్నాయి. - కోల్‌సిటీ

### బకాయి వేతనాల కోసం పంచాయతీ కార్మికుల ధర్నా




ఆరు నెలలుగా జీతాలు చెల్లించకుంటే ఎట్లా బతికేదని గ్రామపంచాయతీ కార్మికులు ప్రశ్నిస్తున్నారు. వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బుధవారం జనగామ కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. రైల్వే స్టేషన్ నుంచి కలెక్టరేట్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. - జనగామ

## చేర్చుకోవడాలు ఆగవ్.. తర్వాత మీ ఇష్టం

- కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డికి ఢిల్లీలో ఝలక్
- పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీతో భేటీ
- అపాయింట్‌మెంట్ ఇవ్వని సోనియా, రాహుల్
- ఏదైనా ఉంటే సీఎంతో మాట్లాడుకోండన్న కేసీ
- రాజీనామా నిర్ణయం వెనక్కి: జీవన్‌రెడ్డి



దీపాదాస్‌మున్షీ

హైదరాబాద్, జూన్ 26 (నమస్తే తెలంగాణ): జగిత్యాల నియోజకవర్గంలో తన ప్రత్యర్థి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సంజయ్‌ను తనకు తెలియకుండానే పార్టీలో చేర్చుకున్నారంటూ ఆగ్రహంతో ఊగిపోయిన కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చివరకు మెత్తబడిపోయారు. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తానంటూ సంకేతాలు ఇచ్చిన జీవన్‌రెడ్డి చివరకు ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారు. ఎమ్మెల్యే సంజయ్‌ను పార్టీలోకి చేర్చుకున్న నేపథ్యంలో తీవ్ర అసహనం వ్యక్తంచేసిన జీవన్‌రెడ్డి.. అధిష్ఠానం పిలుపు మేరకు బుధవారం ఢిల్లీ వెళ్లారు. పార్టీ అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో భేటీ ఉంటుందని భావించిన జీవన్‌రెడ్డికి అధిష్ఠానం ఝలక్ ఇచ్చింది. బుధవారం కనీసం వారి అపాయింట్‌మెంట్ కూడా దొరకలేదు. దీంతో ఆయన రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, కేసీ వేణుగోపాల్‌తో మాత్రమే సమావేశమయ్యారు. ఢిల్లీ పెద్దలతో మాట్లాడిన అనంతరం జీవన్‌రెడ్డి పూర్తిగా రాజీపడిపోయారు. మారుతున్న రాజకీయ పరిస్థితులతో సర్దుకుపోవడానికి సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా దీపాదాస్ మున్షీ మాట్లాడుతూ.. 'కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతాయి. చేర్చుకోవడాలు ఆగవు. తర్వాత మీ ఇష్టం' అని స్పష్టంచేసినట్టు సమాచారం. అయితే, ఎవరినైనా పార్టీలోకి తీసుకొనేటప్పుడు స్థానిక కాంగ్రెస్ నేతలతో చర్చిస్తామని చెప్పారు. జీవన్‌రెడ్డికి ఏమైనా సమస్యలు ఉంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడుకోవాలని కేసీ వేణుగోపాల్ సూచించినట్టు తెలిసింది. అనంతరం జీవన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంటున్నట్టు చెప్పారు. మొదటి నుంచీ పార్టీలో ఉన్న నేతలకు తగిన గౌరవం ఇస్తామని, కార్యకర్తలను కాపాడుకుంటామని కేసీ వేణుగోపాల్ హామీ ఇచ్చారని తెలిపారు. మారుతున్న రాజకీయ పరిస్థితుల్లో కొన్ని నిర్ణయాలు తప్పవని వ్యాఖ్యానించారు. జగిత్యాలలో ఎమ్మెల్యే సంజయ్‌తో కలిసి పనిచేస్తారా? అని మీడియా ప్రతినిధులు జీవన్‌రెడ్డిని ప్రశ్నించగా, అధిష్ఠానంతో కలిసి పనిచేస్తానని చెప్పడం గమనార్హం.

## కౌలు రైతులకూ భరోసా!

మొదటిపేజీ తరువాయి...

25 లక్షల వరకు ఉంటారని కౌలురైతు సంఘాల నేతలు చెప్తున్నారు.

### గ్రామ సభ ఆమోదం పొందాలి

కౌలు రైతులను ఎలా గుర్తిస్తారన్న ప్రశ్నపై.. 2011లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం రూపొందించిన కౌలు రైతుల చట్టం ప్రకారం కౌలు రైతులను గుర్తిస్తామని ఎన్నికలకు ముందు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఆనాడు కౌలు రైతులు రుణాలు పొందే రుణ అర్హత కార్డు (ఎల్ఈసీ) కోసం ఒక నిర్ణీత ఫార్మాట్ తీసుకొచ్చారు. కౌలుదారుకు ఇచ్చిన భూమి విస్తీర్ణంపై కౌలుదారు, యజమాని ఒప్పందంపై సంతకం చేయాలి. ఆ ఒప్పందం గ్రామ సభ ద్వారా ఆమోదం పొందాలి. ఆ తర్వాత కౌలు రైతులు ఎల్ఈసీ పొందేవారు. సీఎం రేవంత్ చెప్పిన దాని ప్రకారం.. ఇప్పుడు రైతు భరోసాకు కూడా ఆ పద్ధతినే అనుసరించాలి. భూమిని కౌలుకు ఇచ్చే యజమాని, కౌలుదారు ఒప్పందంపై సంతకం చేయాలి. ఆ ఒప్పందాన్ని గ్రామ సభ ఆమోదించాలి.

### నమ్మకం కాదు.. చట్టబద్ధం కావాల్సిందే!

ప్రస్తుతం చాలామంది రైతులు నోటిమాట ద్వారా, పరస్పర నమ్మకాల ప్రాతిపదికగానే తమ భూములను కౌలుకు ఇస్తున్నారు. అయితే రైతు భరోసా కోసం కౌలుదార్లు చట్టపరంగా కౌలుకు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ చట్టం ప్రకారం కౌలు రైతులకు అనేక హక్కులు సంక్రమిస్తాయి. కౌలు రైతు కోసం అసలు రైతులు పెట్టుబడి సాయాన్ని కోల్పోయేందుకు సిద్ధంగా ఉంటారా? అనేది పెద్ద ప్రశ్న. ఎవరైనా ఒప్పందం కోసం పట్టుబడితే తమ భూమినే కౌలుకు ఇచ్చేది లేదని అసలు రైతులు తేల్చి చెప్పే అవకాశమూ లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో కౌలు రైతులను ఏవిధంగా గుర్తిస్తారనేది పెద్ద ప్రశ్నగా మారింది.

### సబ్‌కమిటీలో నిర్ణయం

రైతుబంధును రైతుభరోసాగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకంలో కోతలు పెట్టాలని, కొంత మంది రైతులను అనర్హులుగా ప్రకటించాలని భావిస్తున్నది. విధివిధానాల ఖరారుకు ఇప్పటికే మంత్రులతో సబ్‌కమిటీని ఏర్పాటుచేసింది. జూలై 15లోపు నివేదిక ఇవ్వాలని సబ్ కమిటీని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సబ్‌కమిటీ త్వరలోనే తన పని మొదలుపెట్టనున్నది. పార్టీ ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు కూడా రైతుభరోసా ఇవ్వడంపై క్యాబినెట్ సబ్ కమిటీలో చర్చించనున్నట్టు సమాచారం. కౌలు రైతులకు ఎలా ఇవ్వాలి? వారికి ఇవ్వడం వల్ల అసలు రైతులకు ఏమైనా ఇబ్బంది కలుగుతుందా? అసలు కౌలు రైతులను ఏవిధంగా గుర్తించాలి? వంటి అంశాలపై సబ్‌కమిటీలో చర్చించనున్నారు. ఆ తర్వాత కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా విధి విధానాలను రూపొందించనున్నట్టు తెలిసింది.

## ట్రిపుల్ ఆర్‌కు సాగుభూములివ్వం

- ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితుల స్పష్టీకరణ
- మంత్రి కోమటిరెడ్డి తీరుపై మండిపాటు
- గజ్వేల్‌లోని ఐవోసీ కార్యాలయం ఎదుట ధర్నా



గజ్వేల్‌లోని ఐవోసీ కార్యాలయం ఎదుట ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న రైతులు

గజ్వేల్, జూన్ 26: హైదరాబాద్ చుట్టూ నిర్మించతలపెట్టిన ఆర్ఆర్ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) నిర్మాణంతో సాగుచేసే వ్యవసాయ భూములను కోల్పోవాల్సి వస్తున్నదని, సాగుకు అనుకూలంగా లేని భూముల్లో నుంచి ట్రిపుల్ ఆర్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఆర్ఆర్ఆర్ భూనిర్వాసితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బాధిత ర్యాలీ తీశారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ర్యాలీగా ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా ఐవోసీ కార్యాలయానికి చేరుకొని ఆందోళన చేపట్టారు. ఆ తర్వాత ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. చేబర్తి, నర్సన్నపేట, ఇటిక్యాల, పీర్లపల్లి, ఇప్పగూడెం, వర్గల్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన వందలాది మంది రైతులు ఐవోసీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ఆర్ బాధితులు ఇటిక్యాల భాస్కర్, ఎల్లారెడ్డి, చేబర్తి సాయిలు, చేబర్తి బాల్‌నర్సయ్య మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో సాగు భూములు కోల్పోతుండటంతో రైతులకు తీరని అన్యాయం జరుగుతున్నదని అన్నారు. అలైన్‌మెంట్‌లో మార్పులు చేయాలని ఉగాది రోజున రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విన్నవించగా సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు. కానీ, ఇప్పుడు రెవెన్యూ అధికారులు భూసేకరణ కోసం నోటీసులు పంపుతున్నారని, మంత్రి మాటకే విలువ లేదా అని నిర్వాసితులు ప్రశ్నించారు. ఇక్కడ రైతులకు అనుకూలంగా మాట్లాడిన కోమటిరెడ్డి.. ఢిల్లీలో ఆర్ఆర్ఆర్ నిర్మాణం కోసం కేంద్ర మంత్రులను కలవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రధాన కాలువలు, పిల్ల కాలువలు, సొరంగాల నిర్మాణం కోసం చాలామంది రైతులు సాగు భూములు కోల్పోయారని, మరోసారి భూములు ఇవ్వాలంటే ఇక తమకు ఆత్మహత్యే తప్ప మరే మార్గం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. రీజినల్ రింగ్‌రోడ్డు పనులు వెంటనే ఆపి, తమకు న్యాయం చేయాలని రైతులు డిమాండ్ చేశారు.

### ఈసారి దశాబ్ది బోనాల ఉత్సవాలు



ఈ ఏడాది 'దశాబ్ది బోనాల ఉత్సవాలు' పేరుతో బోనాల పండుగ నిర్వహించాలని అధికారులను దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశించారు. గోల్కొండ జగదాంబ మహాకాళి బోనాల ఏర్పాట్లను బుధవారం పరిశీలించి అధికారులతో సమీక్షించారు. హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతారెడ్డి, దేవాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, ఆలయ కమిటీ సభ్యులు, ముస్లిం సంఘాల ప్రతినిధులు హాజరయ్యారు. ఆషాఢ బోనాల పండుగకు ఏర్పాట్ల నిమిత్తం ప్రభుత్వం రూ. 20 కోట్లు విడుదల చేస్తూ బుధవారం దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ ఉత్తర్వులు జారీచేశారు.

## ట్రిపుల్ ఆర్‌కు నిధులివ్వండి

మొదటిపేజీ తరువాయి...

(ఎన్‌హెచ్-930పీ)లో మిగిలిన మూడు ప్యాకేజీల (165 కి.మీ) పనులను త్వరగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీఎం వెంట ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ, చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఉన్నారు.

### కేంద్ర మంత్రికి సీఎం విన్నవించిన మరికొన్ని అంశాలు

- కల్వకుర్తి-కొల్లాపూర్-సోమశిల-కరివెన-నంద్యాల మార్గం (ఎన్‌హెచ్-167కే)లో మిగిలిన 32 కి.మీ. పనులతోపాటు ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని కోరారు.
- హైదరాబాద్-కల్వకుర్తి రహదారి (ఎన్ హెచ్ 765కే)ని నాలుగు లేన్లకు విస్తరించాలని, అమ్రాబాద్ ప్రాంతంలో నాలుగు లేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.
- జగిత్యాల-పెద్దపల్లి-మంథని-కాటారం మార్గాన్ని జాతీయ రహదారిగా ప్రకటించి, నిధులు మంజూరు చేయాలని కోరారు.
- సేతు బంధన్ పథకం కింద 2023-24లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 12 ఆర్వోబీలు/ఆర్‌యూబీలను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.